నరసాపురం ఆస్పత్రిలో ఆధునిక వైద్య సేవ 6







విమానాశ్రయ అవసరం ఎంత?

- పరిశీలించనున్న ప్రభుత్వం.. ఆ తర్వాతే తుది నిర్ణయం
- తాడేపల్లిగూడెంలో ఏర్పాటుకు ఇప్పటికే ప్రతిపాదనలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉంది. సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు అధ్యయనం చేయనుంది. భూములు అందుబాటులో ఉన్నాయి. విమానాశ్రయం ఏర్పాటుకు 1123 ఎకరాలతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ముందుగా విమానాశ్రయ అవసరాలపై అధ్యయనం చేయాలని నిర్ణయించింది. రాజమండ్రి, గన్నవరంలో విమానాశ్రయాలు వున్నాయి. తాడేపల్లిగూడెంలో ఏర్పాటు చేస్తే ఎంత వరకు ప్రయోజనమన్న దానిపై చర్చ సాగుతోంది. వాస్తవానికి పూర్వ పశ్చిమగోదావరి జిల్లాకు నడిబొడ్డున తాడేపల్లిగూడెం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గతంలోనే గూడెంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని సంకల్పించారు. కార్గోకు అనువుగా ఉండాలని భావించారు. పట్టణానికి ఆనుకుని ఉన్న విమానాశ్రయ భూముల్లో ఏర్పాటుకు అప్పట్లో చర్యలు తీసుకున్నారు. ప్రైవేటు ఏజన్సీకి బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత ప్రతిపాదన మరుగన పడింది. గత తెలుగు దేశం ప్రభుత్వంలోనూ జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందుకోసం తాడేపల్లిగూడెం అనువైనదిగా గుర్తించారు. అప్పట్లో ఇది సాధ్యపడలేదు. ప్రస్తుతం తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరోసారి తెరపైకి వచ్చింది. విమానాశ్రయ ఆవశ్యకతను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి.

రాష్ట్ర విభజన తర్వాత మళ్లీ పశ్చిమ అందరి దృష్టిని ఆకర్షించింది. ఆక్వా, ఉద్యాన పంటలు, లేసు ఉత్పత్తులు అభివృద్ధికి అవకాశం ఉంటుంది. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లు ఏర్పాటుకు ఉమ్మడి పశ్చిమ అనువుగా ఉంటుందని భావిస్తున్నారు. మెట్టలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నా విమానాశ్రయం అవసరం. అయితే అంతిమంగా మరోసారి అవసరాలను గుర్తించి, సాధ్యాసాధ్యాలపై ఒక అంచనాకు రానున్నారు. తర్వాతే తుది నిర్ణయం తీసుకోనున్నారు.

పెరిగిన అవసరాలు

15 ఏళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని సంకల్పించింది. అప్పటి కంటే ఇప్పుడు జిల్లాలో అవసరాలు పెరిగాయి. అభివృద్ధి జరిగింది. విద్యా సంస్థలు అభివృద్ధి చెందాయి. ఇతర రాష్ట్రాలకు రాకపోకలు వృద్ధి చెందాయి. ప్రధానంగా జాతీయస్థాయి విద్యా సంస్థ అయిన ఏపీ నిట్‌ను తాడేపల్లిగూడెంలో ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో 5వేల మంది విద్యార్థులు ఉండేలా సన్నాహాలు చేస్తున్నారు. అందులో 2500 మంది ఇతర రాష్ట్రాల నుంచి వస్తారు. మరోవైపు విదేశీ విద్యార్థులకు ఏపీనిట్‌లో అవకాశాలు ఇస్తున్నారు. మున్ముందు విదేశీ విద్యార్థుల సంఖ్య మరింత పెరగనుంది. ఉద్యాన విశ్వవిద్యాలయం జాతీయస్థాయికి ఎదగాలంగే రవాణా సౌకర్యాలు ఉండాలి. తాడేపల్లిగూడెంలో డైరెక్టరేట్ ఆఫ్ ఫ్లోరీకల్చర్ ఏర్పాటుకు గత టీడీపీ ప్రభుత్వంలో కేంద్రం ముందుకొచ్చింది. ఇక్కడ మౌలిక వసతులను పరిశీలించింది. ముఖ్యంగా విమానాశ్రయం అందుబాటులో ఉండాలని కేంద్ర అధికారులు స్పష్టం చేశారు. అటు రాజమండ్రి, ఇటు గన్నవరం విమానాశ్రాయలున్నాయంటూ ఉద్యాన విశ్వవిద్యాలయ అధికారులు ప్రతిపాదించారు. తాడేపల్లిగూడెంలో ఉంటే తక్షణమే కేంద్రం మంజూరుచేసేది. చివరకు అది మహారాష్ట్రకు తరలిపోయింది. డైరెక్టరేట్ ఆఫ్ ఫ్లోరీకల్చర్ ఏర్పాటై ఉంటే కడియం వంటి నర్సరీలకు ఎంతో ప్రయోజనంగా ఉండేది.

స్పెషల్ బాదుడు



పండుగలు, సెలవులు వచ్చాయంటే చాలు రైల్వే, బస్సుల ఆపరేటర్లు ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నారు. స్పెషల్స్ పేరుతో రైళ్లు, బస్సులు నడుపుతూ అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఈ తరహా దోపిడీ సంక్రాంతి, దసరా పండుగల్లో అధికం. నాలుగైదు రోజులు వరుస సెలవులు వచ్చినా.. ఇదే కొనసాగుతుంది. ఈ పరిస్థితుల్లో స్వస్థలాలకు రావాలంటే జేబులు తడుముకోవాలి. అదే కుటుంబమంతా రావాలంటే ఛార్జీలకే వేలకు వేలు ఖర్చు చేయాల్సిందే.

ప్రీమియం పేరిట టిక్కెట్ రేట్లు పెంచిన రైల్వే

- ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు ఇదే తంతు
- టిక్కెట్‌కు రెండు రెట్లు అధికం
- డిమాండ్‌ను బట్టి పెరుగుతున్న ధరలు

నరసాపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి):సంక్రాంతికి సెలవులు ఎక్కువగా ఉండటంతో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబయి వంటి ప్రాంతాల్లో ఉద్యోగాల రీత్యా స్థిరపడిన స్థానికులు పండుగకు ఇంటికి వచ్చేందుకు సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే రెగ్యులర్ సర్వీసుల టిక్కెట్లు నిండుకున్నాయి. దీంతో స్పెషల్స్ పైనే ఆధారపడాల్సి వచ్చింది. ఆలస్యంగానైనా జిల్లా మీదుగా ఎక్కువ స్పెషల్ రైళ్లను నడుపు తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా నరసాపురం -హైదరాబాద్(చర్లపల్లి) మీదుగా 13 స్పెషల్ రైళ్లను ప్రకటించింది. కాకినాడ నుంచి భీమవరం మీదుగా ఎక్కువ రైళ్లనే వేసింది. దీంతో ప్రయాణికులు సంబరపడ్డారు. అయితే టిక్కెట్ ధరలు చూసి షాక్ తిన్నారు.

పెరిగిన ధరలు ఇలా...

రెగ్యులర్‌గా నడిచే నరసాపురం-లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌కు స్లీపర్ టిక్కెట్ రూ.285, ఏసీ త్రీటైర్ రూ.750, టూ టైర్ రూ.1,000 ఉంది. ప్రస్తుతం నడుపుతున్న స్పెషల్‌కు ప్రీమియం పేరుతో రేట్లను పెంచారు. స్లీపర్ టిక్కెట్ రేటు రూ.360, ఏసీ త్రీ టైర్ రూ.1,000, టూ టైర్ రూ.1,335. భీమవరం మీదుగా కాకినాడ వెళ్లే స్పెషల్ రైళ్ల టిక్కెట్లను భారీగా పెంచారు. స్లీపర్‌కు రూ.100, ఏసీకి రూ.250, టూ టైర్‌కు రూ.350 చొప్పున పెంచుకుంటూ పోయారు.

ప్రైవేట్ దందా..

మరోవైపు ప్రైవేట్ ఆపరేటర్లు రెగ్యులర్ సర్వీసులను స్పెషల్స్ పేరిట నడిపి రెట్టింపు దండుకుంటున్నారు. ఒక పక్క సర్వీస్ ఉంటుంది. రెండో వైపు నుంచి ఖాళీగా రావాలనే సాకుగా చూపించి రెట్టింపు ధరలు వసూలు చేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి రేట్లు పెరిగిపోతున్నాయి. ఈ శుక్రవారం నుంచే దందా మొదలుపెట్టారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో టిక్కెట్ రేట్లు రెట్టింపు చూపిస్తున్నాయి. ఎక్కువగా హైదరాబాద్ రూట్లలోనే ఈ వసూళ్లు ఉన్నాయి. జిల్లా మీదుగా నడిచే నాన్ ఏసీ బస్సుల్లో నరసాపురం, పాలకొల్లు, భీమవరం వంటి స్టేషన్లకు సీటుకు రూ.750 నుంచి రూ.850 వరకు టిక్కెట్ ఉంది. బస్సు నిండుకోకపోతే టిక్కెట్ రేట్‌ను తగ్గిస్తారు. స్పెషల్ పేరుతో ఈ సిట్టింగ్ బస్సు ఛార్జీని రూ.1,300కు పెంచేశారు. కొందరు ఆపరేటర్లు హైదరాబాద్ నుంచి రూ.1,500 పైనే వసూలు చేస్తున్నారు. ఇదే ఏసీ అయితే రెగ్యులర్ రోజుల్లో రూ.900 నుంచి రూ.950 ఉంటుంది. స్లీపర్ రూ.1,000 నుంచి రూ.1,200 వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ టిక్కెట్ ధర రూ.2,500 నుంచి రూ.3 వేలు పలుకుతోంది. అత్యధికంగా హైదరాబాద్ నుంచి 12, 13, 14 తేదీల్లో అధిక ధరలు పలుకుతున్నాయి. తిరుగు ప్రయాణంలో 16, 17 తేదీల్లో రేట్లు పెంచేశారు. డిమాండ్‌ను బట్టి ధరలు మారుతున్నాయి. ప్రయాణికులు నిలదీస్తే స్పెషల్ అంటున్నారు.

ఆలస్యంగా రైళ్ల రాకపోకలు

గుంటూరు డివిజన్‌లో గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో మంగళవారం జిల్లా మీదుగా నడిచే పలురైళ్లు ఆలస్యంగా నడిచాయి. ఉదయం 7.15 రావాల్సిన లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 12 గంటలకు వచ్చింది. పది గంటలకు రావాల్సిన నాగర్‌సోల్ మధ్యాహ్నం 12.30కి వచ్చింది. ఇటు నరసాపురం నుంచి ఉదయం 11 గంటలకు వెళ్లాల్సిన నాగర్‌సోల్ మూడు గంటల ఆలస్యంగా బయలుదేరింది. సికింద్రాబాద్ నుంచి భీమవరం మీదుగా వెళ్లే విశాఖ, కాకినాడ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లు ఆలస్యంగా నడిచాయి. తిరుగు ప్రయాణంలోనూ ఆలస్యంగా బయలుదేరాయి. దీంతో ప్రయాణికులు రైళ్లల్లో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇటు ముందు గా స్టేషన్‌కు వచ్చిన ప్రయాణికులు అవస్థలు తప్పలేదు.

మహిళల జీవనోపాధి మెరుగుపర్చాలి: కలెక్టర్

భీమవరం టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మహిళల మెరుగైన జీవనోపాధికి వినూత్న ప్రాజెక్టులు అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లాలో మహిళల ఉపాధికి అవసరమైన ప్రాజెక్టులపై గ్రామీణ్ ఫౌండేషన్ ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వినూత్న ప్రాజెక్టులను అమలు చేయడంతో పాటు, అవసరమైన శిక్షణను అందించాలని సూచించారు. వాటి ద్వారా ఆదాయ మార్గాలు మెండుగా ఉండాలన్నారు. జిల్లాలో వర్మీ కంపోస్టు ఎగుమతులకు అవసరమైన సహాయాన్ని అందించడం, డ్రోన్లు ఎగరవేయడానికి శిక్షణ, డ్రోన్‌లను సమకూర్చడం, డిజిటల్ ఫైనాన్స్ అవకాశాన్ని పెంచడం తదితర ప్రాజెక్టుల రూపకల్పనకు ఆలోచన చేసి అమలుకు సిద్ధం చేయాలన్నారు.

ఎస్సీ కులగణనపై అభ్యంతరాల స్వీకరణ

ఎస్సీ కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల స్వీకరణ గడువును ఈనెల 12 వరకు పొడిగించినట్లు కలెక్టర్ నాగరాణి తెలిపారు. 7తో గడువు ముగియనుండటంతో మరో ఐదు రోజులు పొడిగిస్తూ ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులను జారీ చేసిందన్నారు. 12వ తేదీ వరకు కులగణనపై నిర్దేశిత ప్రాంతాల్లో అధికారులు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారన్నారు.

నేడు ఎకో సెన్సిటివ్ జోన్‌పై సమావేశం

ఆకివీడు, జనవరి 7(ఆంధ్రజ్యోతి):కొల్లేరు అభయారణ్యం చుట్టు పక్కల ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించే అంశంపై ప్రజాభిప్రాయం సమావేశం బుధవారం మధ్యాహ్నం తమ కార్యాలయంలో జరుగుతుందని తహసీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేయవచ్చునని తెలిపారు.

ఏలూరు ఏజెన్సీ ప్రాంతానికి కొత్త దారి

జీలుగుమిల్లి నుంచి పట్టిసీమ వరకు హైవే నిర్మాణం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీ ప్రాంతాన్ని మురిపిస్తున్నాయి. చాన్నాళ్లుగా రోడ్డెక్కాలంటే ఈ ప్రాంతవాసులు హడలిపోయేవారు. ప్రమాదాల్లో గాయపడని వాహనదారులు ఉండేవారు కాదు. ఏటా పెద్ద సంఖ్యలో క్షతగాత్రులు నమోదయ్యే వారు. 2014-19 మధ్య పోలవరం పనులు వేగంగా సాగుతున్నప్పుడు జీలుగుమిల్లి నుంచి పట్టిసీమ వరకు మరో మార్గం ఏర్పాటైతే అత్యద్భుతం అంటూ అప్పట్లో చర్చ సాగింది. దీనిపై కసరత్తు చేయాల్సిందిగా అధికారులకు సంకేతాలు అందాయి. కాని అప్పట్లో అందరి మదిలో మెదిలినట్టుగా ఇప్పుడు ఆ కల సాకారం కాబోతుంది. జీలుగుమిల్లి నుంచి కొత్త పట్టిసీమ వరకు కొత్తగా జాతీయ రహదారి నిర్మించేందుకు రంగం సిద్ధమైంది. కొత్తగా తలపెట్టిన ఈ మార్గం పనులను బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారు.

- రూ.369 కోట్లతో 40 కిలోమీటర్ల రహదారి నిర్మాణం
- నేడు వర్చువల్‌గా పనులు ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- హాజరుకానున్న ఎమ్మెల్యే బాలరాజు, ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఏలూరు జిల్లాలో వరుసగా అద్భుతాలు జరుగుతు న్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువా త అన్ని ప్రాంతాల్లో గుంతలులేని రహదారులను తీర్చిదిద్దేందుకు సంకల్పించారు. తాజాగా జీలుగుమిల్లి నుంచి కొత్త పట్టిసీమ వరకు నాలుగు లైన్ల జాతీయ రహదారిని నిర్మించబోతున్నారు. దీని ద్వారా తెలంగాణ సరిహద్దుల నుంచి రాజమహేంద్రవరం చేరేందుకు సమయం, ప్రయాణం కలిసి వస్తుంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం సాగుతున్న తరుణంలో నూతన మార్గం ప్రాజెక్టు పనులు మరింత విస్తృతంగా సాగేలా దోహదపడబోతుంది. జీలుగు మిల్లి నుంచి కొత్త పట్టిసీమ వరకు దాదాపు 40 కిలోమీటర్ల మేర నాలుగు లైన్ల రహదారిని నిర్మిస్తారు. జాతీయ రహదారి 365 బిబి పరిధిలోకి వస్తుంది. దీని నిర్మాణ వ్యయం దాదాపు రూ.369 కోట్లు. జీలుగుమిల్లి మండలం సరిహద్దున తెలంగాణ పరిధిలోని అశ్వారావుపేటను దాటి తాటాకుల గూడెం, జీలుగుమిల్లి, బర్రింకలపాడు, పి.అంకంపాలెం, రౌతుగూడెం మీదుగా బుట్టాయిగూడెం మండలంలోకి ప్రవేశించి ఎల్‌ఎన్‌డీ పేట మీదుగా పట్టిసీమ వద్ద గోదావరి గట్టు వరకు సాగుతుంది. ఈ క్రమంలో అక్కడక్కడ భూ సేకరణకు పెద్ద ఇబ్బందులు లేకుండా ఇప్పటికే జాగ్రత్త పడ్డారు. ఇంతకుముందు పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతున్నప్పుడు భారీ మిషనరీ, కావాలసిన సామగ్రి పోలవరం చేర్చేందుకు వ్యయప్రయాశలకోర్చేవారు. దానికంటే మించి హైదరాబాదు మీదుగా వచ్చే వారు ఎవరైనా చుట్టూ తిరిగి రావాల్సి వచ్చేది. దీనిని గమనించి తెలంగాణలోని అశ్వారావుపేట నుంచి జీలుగుమిల్లి, పట్టి సీమ వరకు ప్రత్యేక మార్గాన్ని విస్తరిస్తే ఫలితాలు మెరుగ్గా ఉంటాయని అప్పట్లోనే రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు అందాయి. దీనికి సాధ్యమైనంత అనుకూలంగా మలచుకు నేందుకు ప్రయత్నం చేసినా కార్యరూపం దాల్చలేదు. అప్ప టి అంచనాల మేరకు తాజాగా 40 మీటర్ల జాతీయ రహ దారి నిర్మించబోతున్నారు. అనేక చోట్ల కల్వర్టులు కట్టాల్సి వచ్చినా వాగులు, వంకలు దాటుకుని పట్టిసీమ వరకు రహ దారి నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశారు. ఏజెన్సీ ప్రాంతం లో ఇప్పటిదాకా అనేక సమస్యలు రోడ్డు మార్గాల ద్వారానే వచ్చి పడుతూనే ఉన్నాయి. ఏళ్ల తరబడి దెబ్బతిన్న మార్గా లను వైసీపీ హయాంలో మరింత నిర్లక్ష్యం చేయడంతో మారు మూల గ్రామాల నుంచి కనీసం మండల కేంద్రానికి వెళ్లేందుకు కూడా అనువైన మార్గాలే లేకుండా పోయాయి. గిరిజనులు, గిరిజనేతరవర్గాలు అప్పట్లో వైసీపీ ప్రభుత్వానికి విన్నవించినా దిక్కుమొక్కు లేకుండా పోయింది.

నేడు పనులు ప్రారంభం

ఈ పనులను ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం సాయంత్రం 6 గంటలకు వర్చువల్‌గా ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ హాజరవుతారు. ఈ రహదారి నిర్మాణంతో బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, పోలవరం మండలాల్లో సరికొత్త అధ్యాయం ఆరంభం కానుంది. ఇప్పటిదాకా గుంతలు తేలిన రోడ్లతోనే నానా తిప్పలు పడిన వారంతా జీలుగుమిల్లి నుంచి పట్టిసీమ చేరేందుకు అతి తక్కువ సమయం పట్టడమే కాకుండా ప్రయాణం, రవాణ కూడా సులువు కాబోతుంది. ఇప్పటికే 365 బిబి మార్గాన్ని మరింత విస్తరించే క్రమంలోనే ప్రతిపాదనలు ఉన్నాయి. కొత్త పట్టిసీమ నుంచి గోదావరి గట్టును మరింత పటిష్టం చేసి ఈ మార్గానికి అనుసంధానం చేయబోతున్నారు. ఇది పూర్తయితే నేరుగా రాజమహేంద్రవరం చేరేందుకు రవాణా, ప్రయాణికుల వాహనాలకు అత్యంత సులభతరమవుతుంది. సత్తుపల్లి నుంచి జీలుగుమిల్లి మండలం మీదుగా విస్తరి స్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు కొలిక్కి వస్తున్నాయి. ఇప్పుడు సమాంతరంగా జీలుగుమిల్లి-2 పట్టిసీమ జాతీయ రహదారి పనులు పూర్తయితే జీలుగుమిల్లితోపాటు ఏజెన్సీ ప్రాంతానికి సరికొత్త కళ వచ్చినట్టే. ఈ ప్రాంత అభివృద్ధికి ఈ రెండు మార్గాలే దోహదం కాబోతున్నాయి.



రహదారి పనుల ప్రణాళికపై అధికారులతో చర్చిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి(ఫైల్)

కల ఫలించేలా..

ఏజెన్సీవాసులు మెచ్చేలా కేంద్రం 365 బిబి జాతీయ రహదారిని విస్తరించేందుకు కొన్నాళ్ల క్రితమే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జీలుగుమిల్లి మీదుగా నాలుగు లైన్ల రహదారి నిర్మాణం సాగాల్సి ఉండగా దీనిపై సర్వే కూడా నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, జాతీయ రహదారుల ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఈ ప్రాంతాన్ని పదేపదే పరిశీలించారు. రానున్న రెండేళ్లలో ఈ రహదారి నిర్మాణం పూర్తి చేసేందుకు సంకల్పించారు.

పాలకొల్లు డయాలసిస్ సెంటర్ పనుల జాప్యంపై మంత్రి అసహనం




ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్‌పై అధికారులను ప్రశ్నిస్తున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పాలకొల్లులో 100 పడకల ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న డయాలసిస్ సెంటర్ పనులు ఆలస్యం కావడానికి కారణం ఏమిటని, దీనిపై నిర్లక్ష్యం తగదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అధికారులు, కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆసుపత్రిని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ జనవరి నెలాఖరులోపుగా డయాలసిస్ సెంటర్ ప్రారంభించే విధంగా పనులను వారంలోపుగా పూర్తి చేయాలని ఆదేశించారు నాణ్యతా లోపాలు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. డయాలసిస్ వ్యాధిగ్రస్తులు ఆసుపత్రికి వస్తేనే జబ్బు తగ్గిపోయే విధంగా కార్పొరేట్‌ఆసుపత్రికి దీటుగా ఇక్కడ డయాలసిస్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అన్నారు. పనులను మసిపూసి మారేడుకాయలా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఏపీఎంఎస్ఐడీసీ డీఈఈ శ్రీనివాస్ రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, నాయకులు జివి, బోణం నాని, కర్నేన గౌరునాయుడు పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనాలే లక్ష్యం

గ్రామాల్లో జలశక్తి అభియాన్ కేంద్ర బృంద సభ్యుల పర్యటన



భీమలాపురంలో మొక్క నాటుతున్న కేంద్ర జలశక్తి అభియాన్ సభ్యులు

ఆచంట/నరసాపురం రూరల్/పెనుమంట్ర, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సన్నచిన్నకారు రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా జలశక్తి అభియాన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర జలశక్తి అభియన్ చీఫ్ నోడల్ అధికారి జితేంద్రసింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జలశక్తి అభియాన్ జేపీసీ కేంద్ర బృంద సభ్యులైన జితేంద్ర సింగ్, మౌనిక సింగ్, డ్వామా పీడీ సీహెచ్ అప్పారావు మంగళవారం ఆచంట మండలం భీమలాపురం, లంకలో పర్యటించారు. ఇటీవల ఉపాధి హామీ పథకంలో భాగంగా కొంత మంది రైతులకు తైవాన్ జామ పంట సాగు నిమిత్తం మొక్కలు ఇవ్వగా సాగును వీరు పరిశీలించారు. గ్రామంలో మొక్కలు నాటారు. భీమలాపురం నుంచి లంకగ్రామానికి పడవపై వెళ్లారు కార్యక్రమంలో సర్పంచ్ గుబ్బల మాధవరావు, ఎంపీడీవో పూర్ణ బాబ్జి, ఏపీవో సుదర్శన్, సీవో పోసి పాల్గొన్నారు. సీతారాంపురంలో మామిడి తోటలను మంగళవారం కేంద్ర జలశక్తి అభియన్ చీఫ్ నోడల్ అ ధికారి జితేంద్రసింగ్, శాస్త్రవేత్త మౌనిక సింగ్ పరిశీలించారు. రైతులు సాగు చేసిన పంటలను తనిఖీ చేశారు. సర్పంచ్ వెంకట్, ఎంపీడీవో రామకృష్ణంరాజు, ఏపీవో శ్రీనివాస్, కార్యదర్శి ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు. పాలమూరులో కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో సంద ర్శించి ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. జిల్లాలో జలశక్తి అభియాన్ కింద చేపట్టిన పనుల పురోగతి బాగుందని అభినందించారు.



మొగల్తూరు అభివృద్ధికి ప్రణాళికలు

- ఉప ముఖ్యమంత్రి పవన్ ఆదేశాలు
- గ్రామంలో డ్వామా పీడీ రచ్చబండ



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ అప్పారావు

మొగల్తూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మొగల్తూరు పంచాయతీ అభివృద్ధి, గ్రామంలో నూరుశాతం మౌలిక సదుపాయాల కల్పనకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. మెగా కుటుంబం సొంతూరు కావడంతో ఇక్కడ సమస్యలు పరిష్కరించే దిశగా పవన్ కళ్యాణ్ పావులు కదిపారు. గ్రామంలో నూరుశాతం మౌలిక వసతులు కల్పనచేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని పవన్ సూచనలతో జిల్లా డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు రచ్చబండ కార్యక్రమాన్ని మొగల్తూరులోని మెగాస్టార్ చిరంజీవి నివాసంలో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సభలో సర్పంచ్ పడవల మేరీ సత్యనారాయణ, ఉప సర్పంచ్ బోణం నర్సింహరావు, వార్డు సభ్యులు పలు వినతులు అందించారు. పంచాయతీరాజ్, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పనులు పూర్తి చేస్తామని, మిగిలిన శాఖల పనులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. గ్రామంలో డ్రెయినేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.3.30 కోట్లు, సీసీ రోడ్లకు రూ.కోటి 66 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్‌లో ప్రతిపాదనలు వచ్చాయన్నారు. గ్రామంలో కోనాయికోడు మురుగు డ్రెయిన్ ప్రక్షాళనకు, మొగల్తూరు- వెంప ఆర్అండ్‌బి రహదారి నిర్మాణానికి, గ్రామ పంచాయతీకి ప్రత్యేకంగా డంపింగ్ యార్డ్‌కు స్థలం, నిధులు కేటాయింపు, గ్రామంలో పలు చోట్ల కమ్యూనిటీ భవనాలు, శ్మశాన వాటికల అభివృద్ధి, గ్రామంలో ప్రధాన రహదారికి సైడ్ బెరమ్స్ నిర్మాణం, విస్తరణ వంటి సమస్యలను గుర్తించారు.

చిట్..చాట్

చంద్రబాబు అంటే అభిమానం

ఆచంటలో చంద్రబాబు డూప్..



ఆయనను అంతా ఆచంట చంద్రబాబునాయుడు అంటారు. రూపంలో చంద్రబాబునాయుడిని పోలి ఉండడంతో అలా పిలుస్తుంటారు.. వస్త్ర ధారణ, నడత, నడక చంద్రబాబుని తల పిస్తారు. ఆచంట చినపేటకు చెందిన ఆండ్రు లక్ష్మణ్ తెలుగుదేశం పార్టీ అభిమాని.ఎక్కడ పార్టీ కార్యక్రమాలు జరిగినా ఆయన అక్కడ ప్రత్యక్షమవుతారు.. వ్యవయసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే ఆయనకు పార్టీ అంటే చాలా అభిమానం.. దాదాపు 25 ఏళ్లుగా పార్టీలో ఉంటూ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.. చంద్రబాబు డూప్‌గా పిలిచే ఆయనను ఆంధ్రజ్యోతి పలకరించగా పలు విషయాలు చెప్పారు..

• 25 ఏళ్లుగా పార్టీకి సేవలు

సుమారు 25 సంవత్సరాల క్రితమే పార్టీలో చేరాను. అప్పటి నుంచి కార్యకర్తగా పని చేస్తూ పార్టీకి సేవలంది స్తున్నాను. 1995లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జన్మభూమి, ప్రజల వద్దకు పాలన వంటి కార్యక్రమాలకు ఆకర్షి తుడినయ్యాను. ఆయనన్నా ఆయన విధానాలన్నా నాకు చాలా ఇష్టం..ఆయనలా మాట్లాడడం, వస్త్రధారణ చేస్తూ పార్టీ సభలకు వెళ్లేవాడిని.

• పార్టీలకు ఆయనలా మేకప్ అయి వెళుతుంటా..

1998 నుంచి అపుడప్పుడు చంద్రబాబు నాయుడులా వేషధారణ వేసి క్రిస్మస్ కార్యక్రమాల్లో పాల్గొనేవాడిని..ఆయనలా మాట్లాడుతూ హావభావాలు వ్యక్తం చేస్తూ జనాలను ఆకర్షించేవాడిని. అప్పటి నుంచి క్రిస్మస్, బర్త్‌డే పార్టీ కార్యక్రమాల్లో చంద్ర బాబు వేషధారణలో హాజరయ్యేవాడిని. సొంత ఖర్చులతో గన్‌మేన్లలా కొందరిని ఏర్పాటు చేసుకుని నిజంగానే చంద్రబాబు వచ్చారా అన్నట్టుగా పార్టీలకు హాజరవుతుండేవాడిని. మేకప్ అంటే ప్రత్యేకంగా ఏమీ ఉండదు.. ఇంటి దగ్గర ఉంటే వాటినే వేసు కుంటాను.

• చంద్రబాబు,లోకేశ్ అభినందించారు..

చంద్రబాబునాయుడిని చాలాసార్లు కలిశాను. 2019లో తణుకులో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన వేషం వేసుకుని కలిశాను. ఆయన నవ్వుతూ నన్ను అభినందించారు. లోకేశ్‌ను కూడా కలిశాను. యువగళం పాదయాత్రలో చంద్రబాబు గెటప్‌తో వివిధ ప్రాంతాల్లో నేను కూడా పాల్గొన్నాను. లోకేశ్ కూడా నన్ను చాలా అభినందించారు. మొన్న డిసెంబరు 26న ఒక కార్యక్రమంలో లోకేశ్ ట్విట్టర్‌లో నన్ను అభినందించాను.

• కూలిపనులు చేసుకుంటూనే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటా..

ఎమ్మెల్యే పితాని సత్యనారాయణతో పాటు పలువురు నాయకులు, అభిమానులు నేను వేస్తున్న గెటప్‌ను చూసి అభినందించేవారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నేను వినూత్నంగా సైకిల్‌పై ప్రచారం చేస్తుంటాను. కూలిపనులు చేసుకుని జీవించే నేను పార్టీ అభిమానంతో చంద్రబాబు వేషధారణతో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాను. పార్టీ గుర్తించి సాంస్కృతిక విభాగంలో పదవి కల్పించి నన్ను ఆర్థికంగా ఆదుకోవాలని కోరుకుంటున్నాను.





చంద్రబాబు వేషధారణలో వివిధ పార్టీల్లో పాల్గొన్న లక్ష్మణ్

మన పొలంలో..

అగ్రి కల్చర్

బెంగాలీ కూలీలు



తేతలి పొలంలో వరినాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

గతంలో మహిళా కూలీలతో నాట్లు
స్థానికంగా ఉపాధి మార్గాలు పెరగడంతో కూలీల కొరత
పదేళ్లుగా బెంగాల్ నుంచి వలస
95 శాతం నాట్లు వారితోనే
ఖర్చులు కూడా తక్కువ

తణుకు రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): భారత దేశానికి ధాన్యాగారంగా నిలిచే ఉభయ గోదావరి జిల్లాల్లో వరి నాట్లు వేసే పనిలో బెంగాలీ కూలీలు పూర్తి ఆదిపత్యం వహిస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లా వ్యవసాయంలో వరి సాగుకే ప్రాధాన్యం దక్కుతుంది. మన వ్యవసాయ భూముల్లో ఒకప్పుడు వరినాట్లను మహిళలే నాటేవారు. వివిధ ఉపాధి మార్గాలు రావడంతో పాటు స్థానికంగా చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాట వడంతో మహిళలు అందులో చేరిపోతున్నారు.. దీంతో వరినాట్లు వేసేందుకు కూలీల కొరత ఏర్పడింది. ఈ సమయంలో ఇతర ప్రాంతాలకు చెందిన కూలీల అవసరం ఏర్పడింది. మన రాష్ట్రానికి ఒడిశా, బిహార్, బెంగాల్ రాష్ట్రాలతో పాటు ఉత్తరప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాలకు చెందిన కూలీలు వ్యవసాయంతో పాటు వివిధ రంగాల్లో ఉపాధి నిమిత్తం మన రాష్ట్రంలోని వివిధ పట్టణాలు, నగరాలకు వచ్చి ఉపాధి పొందుతున్నారు. అయితే వ్యవసాయ రంగానికి సంబంధించి ముఖ్యంగా వరినాట్లు వేసేందుకు బెంగాలీ కూలీలకు మన ప్రాంతంలో డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం ఉభయ గోదావరి జిల్లాల్లోని వరినాట్లు సుమారు 95 శాతం నాట్లు బెంగాలీ కూలీల ద్వారానే జరుగుతున్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. నైపుణ్యంతో వరినాట్లు వేయడంతో పాటు ఖర్చు కూడా తక్కువ అవుతుండటంతో రైతులు కూడా బెంగాలీ కూలీలతోనే నాట్లు వేయించుకుంటున్నారు..

• బెంగాల్ నుంచి ఇక్కడకు..

మన ఉభయ గోదావరి జిల్లాలతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వరినాట్లు వేసేందుకు పది సంవత్సరాల నుంచి బెంగాలీ కూలీలు వస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని కోత్‌కతా, కలితులా, సిలిగురి, బసంత్, గుసవ, పార్బలీ జిల్లాలకు చెందిన అక్కడ వ్యవసాయంలో ఉపాధి లేక ఆంధ్రప్రదేశ్‌కు వ్యవసాయ పనుల కోసం వలస వస్తున్నారు. ఇక్కడ కొంతమంది మధ్యవర్తుల సహాయంతో వరి పంటకు సంబంధించిన సార్వా, దాళ్వా సీజన్‌లలో రెండు, మూడు నెలల పాటు పనులు చేసుకునేందుకు ఇక్కడకు వస్తున్నారు. సుమారు 2 వేల మంది వరకు ఉమ్మడి పశ్చిమలో నాట్లు వేస్తున్నారు. వీరు ఒక్కో జట్టుగా వివిధ ప్రాంతాలకు వెళుతుంటారు. జట్టుకు 30 నుంచి 50 మంది సభ్యులతో తణుకు, తాడేపల్లిగూడెం, కొవ్వూరు, భీమవరం, ఉండి, ఆకివీడు, అత్తిలి, వంటి ప్రాంతాలకు వచ్చి అక్కడ తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేసుకుని పనులు చేసుకుంటు న్నారు. అక్కడ కంటే ఇక్కడ వారికి మెరుగైన వేతాలు అందుతున్నాయని కూలీలు పేర్కొంటు న్నారు. ఇక్కడ పనుల చేసేందుకు వాతావరణం బాగా వుందని చెబుతున్నారు. ఒక్కో జట్టు రోజుకు 10 ఎకరాల నుంచి 12 ఎకరాలలో వరి నాట్లు వేస్తారు. భూమి విస్తీర్ణాన్ని వీరు సెల్ ఫోన్‌లో యాప్ ద్వారా తెలుసుకుని దాని ఆధా రంగా కూలి డబ్బులు తీసుకుంటారు. దీని వల్ల కొన్ని సందర్భాల్లో వీరి లెక్కల ద్వారా రైతుల తమ భూమి విస్తీర్ణం వివరాలు తెలిసి రెవెన్యూ అధికారులను అడిగి సరి చేసుకున్న సందర్భాలున్నాయి.

• నాట్లు వేయడంలో నైపుణ్యం

బెంగాలీ కూలీలు వరి నాట్లు వేయడంలో నైపుణ్యం కలవారు. నాట్లు ఒక వరుస క్రమంలో వుంటాయి. వీటి ద్వారా పొలంలో ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయడం సులభంగా వుంటుందని రైతుల అభిప్రాయం. బెంగాలీ కూలీల నాట్లు వేయడానికి ఎకరానికి 12 కిలోల విత్తన నారు సరిపోతుంది. అదే మన కూలీలు నాట్లు వేయాలంటే 25 కిలోల విత్తనాల నారు అవసరం అవుతుందని చెబుతున్నారు. బెంగాలీ కూలీలు ఒక ఎకరానికి నలుగురు సరి పోతారు. వీరు నారు తీసిన నాట్లు వేసేందుకు ఎకరానికి రూ.3500 నుంచి రూ. 4 వేల వరకు తీసుకుంటుండగా, ఇక్కడ వారితో అయితే రూ. 5 వేల నుంచి రూ6 వేల వరకూ ఖర్చు అవు తుంది. అంతేకాకుండా ఎకరానికి 10 మంది మహిళలు, వారికి నారు అందించేందదుకు మరో ముగ్గురు మగ కూలీలు అవసరమవుతారు. మనవాళ్లు దూరం దూరంగా నాట్లు వేయడంతో నారు కూడా ఎక్కువ అవసరం అవుతుంది.



తణుకు జాతీయ రహదారి పక్కన బెంగాలీ కూలీలు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక షెడ్లు

ఖర్చు.. శ్రమ తక్కువ



బెంగాలీ కూలీలతో వరినాట్లు వేయడం వలన వారే నారు తీసి, నాట్లు వేయడం వల్ల రైతు లకు ఖర్చులు, శ్రమ తగ్గుతాయి. బెంగాలీ కూలల నాట్ల వల్ల మధ్యలో చేలలో ఎరువులు, పురుగు మందుల పిచికారీకి ఎలాంటి ఇబ్బందులుండవు. పల్లపు పొలాల్లో బెంగాలీ కూలీలతో నాట్లు వేయడం చాలా సులభంగా వుంది.

-ఎస్ శ్రీనివాసరాజు, తేతలి, రైతు

నాట్లు త్వరగా పూర్తవుతున్నాయి



బెంగాలీ కూలీల ద్వారా వ్యవసాయంలో వరినాట్లు త్వరిత గతిని పూర్తవుతున్నాయి. వీరిని బెంగాల్ నుంచి నెల రోజుల ముందు జట్టుగా కొంత సొమ్ము చెల్లించి తీసుకువస్తున్నాం. వీరు ఎకరానికి రూ. 4 వేల వరకు వసూలు చేస్తున్నారు. బెంగాలీ కూలీల ద్వారా రైతులకు తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో పనులు పూర్తికావడంతో రైతులు వీరితో నాట్లు వేయించుకునేందుకు మక్కువ చూపుతున్నారు.

-కోనా బాబీ, తణుకు, బెంగాలీ కూలీల మధ్యవర్తి

95 శాతం నాట్లు బెంగాలీ కూలీలవే ...



ఉభయ గోదావరి జిల్లాల్లోని వ్యవసాయంలో బెంగాలీ కూలీలే 95 శాతం వరి నాట్లు వేస్తున్నారు. యంత్రాల ద్వారా 1 శాతం, స్థానిక కూలీల ద్వారా 3 శాతం మాత్రమే నాట్లు వేస్తారు. బెంగాలీ కూలీలు యంత్రాలతో సమానంగా వరినాట్లు వేస్తున్నారు. వీరు వేసే నాట్లు ఒక క్రమ పద్ధతిలో ఒక వరుస క్రమంలో రైతులు ఎరువులు, పురుగు మందుల పిచికారీకి వీలుగా బాటలు వేసినట్లుగా వుంటుంది. వీరు మొత్తం పురుషులే నారు తీసి, దానిని చేలోకి మోసుకెళ్లి నాట్లు వేస్తారు. అందువల్ల రైతులు కూడా బెంగాలీ నాట్లు వైపే మొగ్గు చపుతున్నారు.

-ఎంవీ రమేష్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, తణుకు

ఇక్కడ ఎక్కువ కూలీ వస్తుంది



వరి నాట్లు వేసేందుకు గత ఐదు సంవత్సరాలుగా ఇక్కడకు వస్తున్నా. వరినాట్లు ద్వారా మంచి ఆదాయం పొందుతున్నా. ఇక్కడ వాతావరణం చాలా బాగుంది. మా ప్రాంతం కలితులాలో ఎక్కువగా గోదుమ పంట సాగు చేస్తున్నారు. అక్కడ పనులు తక్కువే, ఆదాయం కూడా తక్కువే.

-బిషోయ్ జిత్, బెంగాలీ కూలీ

ఆధునిక వైద్యానికి కేరాఫ్‌గా..

స్కాన్



100 పడకలకు అప్‌గ్రేడ్ అయిన నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రి

ఇటీవల నరసాపురంలో ఒకరికి గుండెపోటు వచ్చింది . ఆర్థిక స్తోమత లేకపోవడంతో కుటుంబ సభ్యులు నరసాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తీసు కొచ్చారు. ఈసీజీ తీసి గుండెపోటుగా నిర్ధారించి రక్తనాళాల్లో బ్లాక్‌లు కరిగించే ఖరీదైన ఇంజక్షన్ చేసి ప్రాణాలను నిలబెట్టారు.. ఇదే పరిస్థితి ఆస్పత్రిలోని సర్జన్ కూడా కలిగింది. విధుల్లో ఉన్న ఆయనకు గుండెపోటు రావడంతో ఆయనకు ఇంజక్షన్ చేసి ప్రాణం పోశారు...

మరో కేసులో ఓ రోగి కడుపునొప్పితో ఆస్పత్రికి వచ్చాడు, పరీక్షించి 24 గంటల నొప్పిగా నిర్ధారించారు. వెంటనే శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు నిలబెట్టారు. ఇటీవల కాలంలో ఇలాంటి వైద్యాలు ఎన్నో చేసి ప్రజల ప్రాణాలు కాపాడారు. రోగులకు ప్రభుత్వ ఆస్పత్రిలో మంచి వైద్యం దొరుకుతుందన్న నమ్మకాన్ని పెంచారు.. గతంలో నరసాపురం ఆసుపత్రి జిల్లాలో ఉత్తమ ఆస్పత్రిగా ఎన్నికై అవార్డును పొందింది.

నరసాపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గతంలో నరసాపురం ఆస్పత్రిలో 50 పడకలు మాత్రమే ఉండేవి. యాక్సిడెంట్, డెలివరీలకు సంబంధించి క్రిటికల్ కేసుల్ని ఏలూరు పంపించేవారు. కేవలం నలుగురు వైద్యులు మాత్రమే ఉండేవారు. అయితే నేడు పరిస్థితి మారింది. ఆస్పత్రి స్థాయి 50 నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ అయింది. నలుగురు నుంచి డాక్టర్ల సంఖ్య 19కి పెరిగింది. ఒక రేడియా లజిస్టు, గుండె వైద్యులు, ఎముకలకు సంబంధించి ఆపరేషన్లు మినహా అన్ని శస్త్ర చికిత్సలు ఇక్కడ జరుగుతున్నాయి. ఇద్దరు మత్తు డాక్టర్లు, ఒక చిన్న పిల్లల డాక్టర్, చర్మవ్యాధి, ఈఎన్‌టీ, కంటికి సంబంధించి డాక్టర్లు ఉన్నారు. రోజుకు 300 నుంచి 500 మంది రోగులు ఈ ఆస్పత్రికి వస్తు న్నారు. నెలకు 400లకు పైగా మేజర్, మైనర్ సర్జరీలు చేస్తున్నారు. అందులో 80కి పైగా డెలవరీ సర్జరీలే ఉంటున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రిలో డెలివరీకి సిజేరియన్ చేయాలంటే రూ.30 నుంచి రూ.50 వేలు అవుతుంది. అయితే డెలివరీకి ప్రభుత్వ ఆస్పత్రిలో ఒక్క రూపాయి ఖర్చు అవ్వడం లేదు.

అత్యాధునికమైన పరికరాలు

ఇక కంటికి సంబంధించి శుక్ల ఆపరేషన్లు, గొంతు, చెవికి సంబంధించి మైనర్ ఆపరేషన్లు కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో చేస్తున్నారు. వీటికి సంబంధించి పరికరాలు, థియేటర్లు కూడా ఉన్నాయి. కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. ఆపరేషన్లు చేసేందుకు ప్రత్యేకంగా మూడు థియేటర్లు ఉన్నాయి. ఒకే సమయంలో రెండు సర్జరీలు చేసే పెద్ద థియేటర్ జిల్లాలో ఈ ఆస్పత్రిలోనే ఉంది. ఇక రక్త పరీక్షలకు సంబంధించి రూ.30 లక్షల విలువైన అత్యాధునికమైన పరికరాలు అందుబాటులో ఉన్నాయి. హార్మోన్స్ పరీక్షలు మినహా ప్లేట్‌లైట్స్, కిడ్నీ, లివర్, రక్తం శాతం, పోటాషియం, సోడియం లెవల్స్‌కు సంబంధించిన పరీక్షలు కూడా ఇక్కడ నిర్వహిస్తున్నారు. పాము, కుక్క కాటులకు వ్యాక్సిన్ నిరంతరం అందుబాటులో ఉంటుంది.

ఆస్పత్రిలోనే బ్లడ్ బ్యాంకు

రోగుల ప్రాణాలు నిలబెట్టే బ్లడ్ బ్యాంకు కూడా ఈ ఆస్పత్రిలోనే ఉంది. దీని వల్ల అత్యవసరమైన కేసులకు త్వరితగతిన రక్తం అందించే వీలుంటుంది. ఇక జిల్లాలో ఏ ఆస్పత్రికి లేని విధంగా 13 ఏసీ స్పెషల్ రూమ్‌లు ఉన్నాయి. వీటిని నామమాత్రపు అద్దెతో రోగులకు ఇస్తున్నారు. ఇక రెండు ఏసీ జనరల్ వార్డులు కూడా ఉన్నాయి. ప్రసూతి మహిళలకు కేటాయిస్తున్నారు.

ముగ్గురు వైద్యుల కొరత

అయితే ఈ ఆస్పత్రిలో ఇంకా ముగ్గురు వైద్యుల కొరత ఉంది. సివిల్ సర్జన్, డిప్యూటీ సివిల్ సర్జన్, రేడియాలజిస్టులు లేరు... వీరితో పాటు శానిటేషన్ సిబ్బంది కూడా తక్కువే. ఆస్పత్రి స్థాయి పెరిగినా దానికి అనుగుణంగా శానిటరీ సిబ్బందిని పెంచలేదు. ఇక ఆర్థోసర్జన్ ఉన్నప్పటికీ సర్జరీలు చేసేందుకు ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో పరికరాలు లేవు. ఈ కారణంగా సర్జరీలు ముందుకు సాగడం లేదు. ఏదైనా యాక్సిడెండ్ కేసు వస్తే ఏలూరు లేదా భీమవరం పంపిస్తున్నారు. స్కానింగ్ మిషన్లు ఉన్నా రేడియాలజిస్టులు లేకపోవడంతో అవి వృథాగా మిగిలాయి. గర్భిణులకు స్కానింగ్ చేయాలంటే బయటకు వెళ్లాల్సిందే.

త్వరలో డయాలసిస్ సెంటర్



ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య గతం కంటే బాగా పెరిగింది. దానికి కారణం పూర్తిస్థాయిలో వైద్యులు ఉండటం, మెరుగైన వైద్య సేవలు అందించడమే. ఇంకా ముగ్గురు వైద్యుల కొరత ఉంది. వాటిని భర్తీ చేస్తే అత్యవసర కేసుల్ని కూడా ఇక్కడే చూడవచ్చు. త్వరలో ఆస్పత్రికి డయా లసిస్ సెంటర్ రాబోతున్నది. ఇది వస్తే కిడ్నీ రోగులకు ఇబ్బందులు ఉండవు.

-డాక్టర్ సుప్రియ, సూపరింటెండెంట్



రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది



ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న రోగులు



ఆధునిక ఎక్స్‌రే ల్యాబ్

కృషి పండిట్ నెక్కంటికి రిపబ్లిక్‌డే వేడుకలకు ఆహ్వానం



రాష్ట్రపతి పంపిన ఆహ్వానంతో రైతు నెక్కంటి సుబ్బారావు

ఆచంట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆచంటకు చెందిన కృషి పండిట్ నెక్కంటి సుబ్బారావుకు ఈ నెల 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్‌డే వేడుకలకు రాష్ట్రపతి నుంచి ఆహ్వానం అందింది. కృషి పండిట్‌గా పిలవబడే నెక్కంటికి 89 సంవత్సరాలు వయసు... గత అరవై ఏళ్లుగా వ్యవసాయం చేస్తూ రైతులకు తాను పండించిన కొత్త వరి వంగడాలను అందిస్తున్నారు. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, కర్ణాటక , తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో అనేక మంది రైతులకు సుబ్బారావు కొత్త సీడ్ ఇచ్చి రైతులను పోత్సహిస్తున్నారు. 1967లో అప్పట్లో కేంద్ర మంత్రి టి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో హరిత విప్లవం ఆచంట నుంచి మొదలైంది. మొదట్లో ఐఆర్ 8 పొట్టి వరి వంగడాన్ని ఆచంటలో అభివృద్ధి చేసి దానిని అనేక దేశాలకు అందించడంలో సుబ్బారావు పాత్ర ఎంతో కీలకం. ప్రస్తుతం కొత్తగా అత్యంత సన్న రకం ఆర్‌జీఎల్ 7034, 7039 వరి వంగడాలను సాగు చేస్తున్నట్లు సుబ్బారావు తెలిపారు. కొత్త వరి వంగడాలను పంపి రైతులను ప్రోత్సహిస్తున్నందుకు ఇప్పటి వరకు సుబ్బారావు 16 నేషనల్, 3 ఇంటర్నేషనల్ అవార్డులు అందుకున్నారు. రిపబ్లిక్ వేడుకలకు రాష్ట్రపతి ద్వారా ఆహ్వానం అందడం పట్ల సుబ్బారావును పలువురు అభినందించారు.

మ్యాజిక్ స్టార్ బోస్ మరో రికార్డు



బోస్ రచించిన 'నా ప్రస్థానం'ను మంత్రి నారా లోకేశ్‌కు అందిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మేజిక్ స్టార్ డాక్టర్ బోస్ నాలుగు సంవత్సరాల క్రితం చేసిన రచన 'నా ప్రస్థానం'ను అరుదైన గ్రంథంగా గుర్తించిన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ బోస్‌కు 'ఐబీఆర్ అచీవర్' అవార్డును ప్రదానం చేసింది. మేజిక్ రంగంలో మెజీషియన్‌గా, రచయితగా 50 సంవత్సరాల తన అనుభవాలతో బోస్ చేసిన స్వీయచరిత్ర 'నా ప్రస్థానం' అని ఆ సంస్థ తన సర్టిఫికెట్‌లో పేర్కొంది. బోస్ తన ఆత్మకథా పుస్తకంలో మేజిక్ రంగం తనను ఆకర్షించిన విధానం, తాను అందులో ప్రవేశించడానికి చేసిన ప్రయత్నాలు, మేజిక్ నేర్చుకున్న విధానం,నెలకొల్పిన మేజిక్ సంస్థల వివరాలు, మేజిక్ రచయితగా మారిన విధానం, మేజిక్ గ్రంథాల రచనలు, అవార్డులు, సన్మానాలు, రికార్డులు, ఇలా తన చరిత్రను పలు అధ్యాయాలుగా వివరించారు. సోమవారం భీమవరం పర్యటనకు వచ్చిన లోకేశ్‌కు ఆయన ఈ పుస్తకాన్ని అందజేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.85 కోట్లు



హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చిన వెంకన్న హుండీల లెక్కింపు ద్వారా భారీ ఆదాయం సమకూరింది. 40 రోజులకు రూ.3.85 కోట్ల ఆదాయం లభించినట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈవో వేండ్ర త్రినాథరావు తెలిపారు. ప్రమోద కల్యాణ మండప ఆవరణలో మంగళ వారం అత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ హుండీల లెక్కింపును నిర్వహించారు. 3,85,61,549 రూపాయల నగదుతో పాటు 383 గ్రాముల బంగారం, 12.008 కేజీల వెండి లభించినట్లు ఈవో వివ రించారు. రద్దయిన పాతనోట్లు రూ.500 (23), 1000(4) 2000(7)తో పాటు విదేశీ కరెన్సీ సైతం లభించింది.



కోమటికుంటలో శ్రీమాతంగమ్మ రైస్‌మిల్లులో తనిఖీలు చేస్తున్న అధికారులు

మేకా శేషుబాబు రైస్‌మిల్లులో పీడీఎస్ బియ్యం పట్టివేత

కేసు నమోదు

గోపాలపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలంలో కోమటికుంట రెవెన్యూ పరిధిలో శ్రీమాతంగమ్మతల్లి ఆగ్రో రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం గుట్టు రట్టయ్యింది. పాలకొల్లుకు చెందిన వైసీపీ మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, కోమటి గుంట గ్రామానికి చెందిన పశ్చిమగోదావరి జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి భాగస్వామ్యంతో కొనసాగుతున్న ఈ మిల్లులో అధికారులు రెండు రోజుల పాటు తనిఖీలు చేశారు. మంగళవారం రెవెన్యూ అధికారులు సుమారు 5 టన్నుల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసు కున్నారు. ఈ రైస్‌మిల్లులో శేషుబాబు కుటుంబంలో నలుగురికి 80 శాతం వాటాలు, మిగిలిన 20 శాతం శ్రీరామమూర్తి భాగస్వా మ్యంతో ఫర్మ్ రిజిస్ట్రేషన్ చేయించారు. ఇటీవల భాగస్వాముల మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ మిల్లు నిర్వహణపై ఎప్పటి నుంచో ఎన్నో ఆరోపణలు ఉండడంతో గతంలో తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ రైస్‌మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. అయితే అప్పుడు వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో విషయం బయ టకు పొక్కలేదు. ఇదిలా ఉండగా రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు ఉంచి నట్టు, ఏలూరు జిల్లా జంగా రెడ్డిగూడెం విష్ణుప్రియ మిల్లు పేరుతో మరొక లోడు ఉన్న విషయం బయటకు పొక్కింది.ఈ మేరకు సమాచారం అందుకున్న సివిల్ సప్లయిస్, పోలీస్, రెవెన్యూ అధికారులు మిల్లును చుట్టుముట్టి సోమవారం సాయంత్రం నుంచి మంగళ వారం మధ్యాహ్నం వరకు తని ఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ప్లాస్టిక్ సంచుల్లో 2,133 కేజీల పీడీఎస్ బియ్యంతో పాటు మరో లారీలో రీసైక్లింగ్ చేసి గోనె సంచుల్లో ఉన్న 580 బస్తాలకు సంబంధించి 3.01 టన్నుల బియ్యం మొత్తం 5,233 కేజీలు సీజ్ చేసినట్టు తహసీల్దార్ కె.అజయ్‌బాబు, సీఎస్ డీటీ దివాకర్ తెలిపారు. యజమానులు మేకా శేషుబాబు, శ్రీరామ్మూర్తిపై 6ఏ కేసు నమోదు చేశారు.

అమృత మూర్తికి అశ్రునివాళి



కీ॥ శే॥ మన్నే సుబ్రమణ్యం గారు

జననం: 29-01-1969 మరణం: 24-12-2024

M- Power Infratech Pvt. Ltd. - MD, Xenia Hospital - Chairman

అందరి మనస్సులో చెరగని స్థానం సంపాదించిన
మీరు మా నుండి దూరమైనా... మీ మధుర స్మృతులు,
జ్ఞాపకాలు మా మదిలో పదిలంగా ఉన్నాయి. మీరు లేని లోటు తీర్చలేనిది.
మీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

బాధాతప్త హృదయాలతో

TGK మూర్తి	బండి వెంకటేశ్వరరావు	కనకమేడల నాగమురళి
ముప్ప రామారావు	నాగభైరవ సాంబశివరావు	కొల్లి లక్ష్మణ్‌కుమార్
పి.వి. నరేష్	యడ్ల పాపారావు	సబ్బినేని వాసు
పోలేపల్లి కొండలరావు	పెదర్ల శరత్‌చంద్ర	నన్నపనేని వెంకట సత్యనారాయణ (NVS)
మేకా లక్ష్మణరావు	యార్లగడ్డ మురళి	పరుచూరి ప్రసాద్ (చిన్ని)
కొసరాజు వెంకట నాగ సుధాకర్ (నాని)	పరుచూరి వెంకటచలపతిరావు	కందాడి హనుమంత్‌రెడ్డి
కొత్తపల్లి రాంబాబు	వీరమాచినేని ప్రవీణ్	అశోక్‌కుమార్ స్వైన్

తెలుగుదేశం పార్టీ, ఉప్పల్ - తెలంగాణ & మన్నే సుబ్రమణ్యం మిత్ర మండలి

రేపు ప్లేస్‌మెంట్ డ్రైవ్

పెంటపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎన్‌సీఎస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 9న ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోక్‌మాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18-30 ఏళ్ళ మధ్య వయస్సున్న వారు ఆన్లైన్ ద్వారా వివరాలు నమోదు చేసుకుని ఇంట ర్వ్యూలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 7013896277లో సంప్రదించాలన్నారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్యుల రాక

పెంటపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : అలంపురం ట్రస్టు ఆసుపత్రి కి ఈ నెల 9న రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుండి ప్రత్యేక వైద్య నిపుణులు వస్తున్నట్లు ట్రస్టు ఛైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. జనరల్ మెడిసిన్, కాన్సర్, స్త్రీలు, చిన్న పిల్లలు, గుండె సమస్యలతో పాటు సంతాన సాఫల్యతా శిబిరం కూడా నిర్వహిస్తారన్నారు. అవసర మైన వారికి ఈసీజీ, టూడీ ఈకో, అల్ట్రాసౌండ్ పరీక్షలతో అన్ని రకాల రక్త పరీక్షలు కూడా ఉచితంగా చేస్తారని ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

జంతు సంక్షేమ సంఘ డైరెక్టర్‌గా అజయ్

అత్తిలి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : జంతు సంక్షేమ సంఘం జిల్లా డైరెక్టర్‌గా అత్తిలికి చెందిన ఆల్తి అజయ్ కుమార్‌ను కలెక్టర్ నియమించడంపై అత్తిలి మండల టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మూగ జీవాల సంరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని అజయ్‌కుమార్ అన్నారు.



టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న కామన రాంబాబు

పాలకోడేరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు ఆధ్వర్యంలో టీడీపీ మండల నాయకుడు, గొల్లలకోడేరు గ్రామానికి చెందిన కామన రాంబాబు, అల్లూరి శ్రీనివాసరాజు మంగళవారం టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. సోమవారం భీమవరం విచ్చేసిన మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశామని కామన రాంబాబు తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

తణుకు రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): టెన్త్ విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని తణుకు పైడిపర్రు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎం. ఏడుకొండలు చెప్పారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన విద్యార్థులు, తల్లి దండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సెల్ ఫోన్‌లు, టీవీలకు దూరంగా వుండాలన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన ఉండాలి

పెంటపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్గి ఉండాలని మానసిక ఆరోగ్య నిపుణుడు డాక్టర్ టి.శంకర్‌రెడ్డి సూచించారు. మంగళవారం పెంటపాడు పీహెచ్‌సీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మానసికంగా ఇబ్బంది పడేవారిని గుర్తించి చికిత్స చేయించాలన్నారు. సైకియాట్రిక్ సోషల్ వర్కర్ సుమన్‌బాబు, క్లినికల్ సైకాలజిస్టు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎవరైనా తమలో తాము మాట్లాడుకోవడం, నవ్వుకోవడం చేస్తుంటే వారిని తక్షణం వైద్యులకు చూపించాలన్నారు.

రిటైర్డ్ ఎంఈవో విరాళం

అత్తిలి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి జొన్నలవారి లోకాలిటీ ప్రాథమిక పాఠశాలకు పెయింట్లు నిమిత్తం రిటైర్డ్ మండల విద్యాధికారి సీతాల వెంకట నారాయణ రూ. 20 వేల రూపాయలు విరాళంగా అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి నాగమణి తెలిపారు. పాఠశాలకు రంగులు వెలిసిపోవడంతో తమ అభ్యర్థన మేరకు నగదు అందజేసినట్టు తెలిపారు.

పేదలకు దుప్పట్ల వితరణ

భీమవరం అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): భీమవరం పట్టణంలోని పలు ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు చెందిన వృద్ధులకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ భీమవరం శాఖ అధ్యక్షులు పెన్మెత్స రామ్మోహన్‌వర్మ (పూనా రాము) దుప్పట్లు, లుంగీలు, పంచెలు పంపిణీ చేశారు. కార్యక్రమ నిర్వాహకులు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ చిన అమిరం విశ్వశాంతి వృద్ధాశ్రమం కరస్పాండెంట్ భూపతిరాజు సత్యనారాయణరాజు వీటిని ఇందిరమ్మ కాలనీలోని వృద్ధులు, ప్రేమాలయం ఓల్డ్ ఏజ్ హోంలో 70 మందికి పంపిణీ చేశామన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం ఎల్ఎల్ఎం చర్చిలో పాస్టర్ జైబాబు కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు అందించారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్, జనసేన పట్టణాధ్యక్షుడు వర్తనపల్లి కాశీ తదితరులు పాల్గొన్నారు.



కొప్పర్రు సొసైటీ భవనం

నామినేటెడ్ పదవుల పంపకాల్లో..

కుదిరిన ఒప్పందం

- 12 సొసైటీల్లో టీడీపీ, జనసేన చెరి సగం

నరసాపురం టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): త్వరలో భర్తీ చేసే సహకార సంఘాల నామినేటెడ్ పదవుల పంపకంలో కూటమిలో ఒప్పందం కుదిరింది. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో మొత్తం 12 సొసైటీలు ఉండగా టీడీపీ, జనసేన చెరో సగం తీసుకోవాలని నిర్ణయానికి వచ్చారు. దీంతో ఇరుపార్టీల అభ్యర్థులపై కసరత్తు చేస్తున్నారు. సామాజిక వర్గాలు, పార్టీలకు వారు చేసిన సేవలల్ని పరిగణలోకి తీసుకుని ఎంపిక చేస్తున్నారు. అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని అభ్యర్థుల ఎంపిక చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటి వరకు కుదిరిన ఒప్పందంలో నరసాపురం, మల్లవరం, ఎల్‌బీ చర్ల, పేరుపాలెం, జగన్నాథపురం, కాళీపట్నం సొసైటీలు టీడీపీ తీసుకోగా మొగల్తూరు, సీతారాంపురం, లక్ష్మణేశ్వరం, కొప్పర్రు, తూర్పుతాళ్ళు, కేపీపాలెం సొసైటీలు జనసేన తీసుకుంది. ఎమ్మెల్యే నాయకర్, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు వారం రోజులుగా దీనిపై కసరత్తు చేసి ఒక నిర్ణయానికి వచ్చారు. సొసైటీలు ఖరారు కావడంతో ఇక అభ్యర్థులపై కసరత్తు చేస్తున్నారు. టీడీపీ తరఫున అధికారి అనంతరామారావు, సంది నర్సింహారావు, గుబ్బల వీరా స్వామి, కవురు ముత్యాలరావు, జక్కంశెట్టి వెంకటేశ్వరావు, వేగేశ్న త్రినాధ్‌రాజు పేర్లను ఖరారు చేశారు. వీరిలో మాజీ వీసీ అధికార అనంత రామారావును నరసాపురం సొసైటీ అధ్యక్షుడిగా నియమిం చనున్నారు. టీడీపీకి కేటాయించిన స్థానాల్లో మూడు బీసీ, ఒక ఎస్సీ, రెండు ఓసీలకు ఇవ్వనున్నారు. ఇక జనసేన తరుపున రావూరి సురేష్, అందే నర్సేన్, కలవకొలను తాతాజీ, మైలా శివకుమార్, నిప్పులేటి తారక రామారావు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఇక లక్ష్మణేశ్వరం సొసైటీ అధ్యక్ష పదవి ఎంపికను పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాగంటి చిన్నకు అప్పగించారు.

ఇంటర్వ్యూ..

సారా నియంత్రణకు గట్టి నిఘా



రాంబాబు,
ఎక్సైజ్ సీఐ, నరసాపురం

- **తీరంలో సారా కేసులు ఏమైనా నమోదు అయ్యాయా?**

జవాబు: ఇటీవల 3 కేసులు నమోదు చేశాం.

- **ఏ ప్రాంతంలో తయారవుతోంది?**

జవాబు: కృష్ణా జిల్లా సరిహద్దు నుంచి అధికంగా వస్తుంది. సర్కిల్‌లో మొగల్తూరు మండలంలోని కట్టావారిమెరక, ముత్యాలపల్లి, కాళీపట్నం, కుక్కలవారితోట ప్రాంతాలను సారా అనుమానిత ప్రాంతాలుగా గుర్తించాం.

- **సరిహద్దు జిల్లా నుంచి రాకుండా ఏం చర్యలు చేపట్టారు?**

జవాబు: కృష్ణా, పశ్చిమ జిల్లాలు సారా నియంత్రణకు జాయింట్ ఆపరేషన్ చేయాలని నిర్ణయించాం. కృష్ణా జిల్లాలో సారా తయారయ్యే ప్రాంతాల్లో ముమ్మర దాడులు చేయాలని నిర్ణయించాం.

- **ఈ ఏడాది బెల్ట్ షాపులపై ఎన్ని కేసులు పెట్టారు?**

జవాబు: ఏడు కేసులు నమోదు చేసి ఏడుగురిని అరెస్టు చేశాం.

(ఆంధ్రజ్యోతి- నరసాపురం టౌన్)

డయేరియాను కట్టడి చేయండి : డీఎంహెచ్‌వో



పాలకోడేరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): శృంగవృక్షంలో డయేరియా నివారణకు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి మరో రెండు రోజులపాటు గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ భానునాయక్ అన్నారు. శృంగవృక్షం వడ్డీల వారి వీధిలో రెండు రోజులుగా ఆ ప్రాంత ప్రజలు వాంతులు, విరోచనాలతో ఇబ్బందులు పడుతుండటంతో డీఎంఅండ్‌హెచ్‌వో మంగళవారం ఆయన గ్రామంలో పర్యటించారు. పారిశుధ్యం మెరుగుపరచాలని, ఆర్ఎంపీ వైద్యులు ఇష్టానుసారం వైద్యం చేయవద్దని ఏదైనా ఇబ్బంది ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పంచాయతీ సిబ్బంది బ్లీచింగ్ పౌడర్ చల్లి పారిశుద్యాన్ని మెరుగుపరిచారు. వైద్యురాలు డాక్టర్ లీలాలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థిగా మారిన జేసీ!

విద్యార్థులతో కూర్చుని పాఠాలు విన్న రాహుల్‌కుమార్ రెడ్డి



భీమవరం రూరల్/పాలకోడేరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. మంగళవారం భీమవరం మండలం బేతపూడి జడ్పీ హైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులతో కలసి బెంచీపై కూర్చుని ఉపాధ్యాయురాలు చెబుతున్న పాఠాలు విన్నారు. విద్యార్థులతో కలసి కింద కూర్చుని సహపంక్తి భోజనం చేశారు. వంటకాలను ప్రతిరోజూ పరిశీలించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. తహసీల్దార్ రావి రాంబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సులో స్వీకరించిన అర్జీల ను త్వరితగతిన పరిష్కరించాలని జేసీ సం బంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం బేతపూడి కమ్యూనిటీ హాల్ వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన వినతులను స్వీకరించారు. గ్రామంలో మంచినీటి చెరువు కలుషితమైపోయిందని, డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదని గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో అధికారులతో పరిశీలించి అధికారు లకు తగు సూచనలు చేశారు. మంగళవారం పాలకోడేరు మండలం పెన్నాడ ఎఫ్‌సీఐ గిడ్డంగిని జేసీ ఆకస్మిక తనిఖీ చేశారు. బియ్యం భద్రపరచడంలో నాణ్యతా ప్రమా ణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ టి. శివరామ ప్రసాద్, డిపో మేనేజర్ ఆనంద్, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ జయశంకర్, ఏఎం టెక్నికల్ మహమ్మద్ ఇబ్రహీం, టెక్నికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ తానికొండ మేరీ గోల్డ్ మృతి

నరసాపురం టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మాజీ మునిసిపల్ కౌన్సిలర్ తానికొండ మేరిగోల్డ్ (85) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. 19వ వార్డు నుంచి ఆమె టీడీపీ తరఫున పోటీ చేసి గెలుపొందారు. పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీలోనే కొనసాగారు. ఆమె పార్థివ దేహాన్ని టీడీపీ ఇన్‌చార్జి రామరాజు, జక్కం శ్రీమన్నారాయణ, ఎం రవి, బాబ్జీ తదితరులు సందర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

నేడు పెనుమంట్ర మండల సర్వ సభ్య సమావేశం

పెనుమంట్ర, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నేడు పెనుమంట్ర మండలం సర్వ సభ సమావేశం మండల పరిషత్ అధ్యక్షుడు కర్రి వెంకట నారాయణ రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో శర్మ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు పెనుమంట్ర మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగే సమావేశానికి మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరు కావాలని కోరారు.

శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం

పాలకొల్లు అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 23వ వార్డుకు చెందిన మాలాశ్రీ అనే మహిళ ఇటీవల అపెండిసైటిస్ ఆపరేషన్ ఖర్చులను మిత్రుల సహకారంతో టీడీపీ నాయకుడు పొట్నూరి అప్పన్న రూ. 30 వేలు అందజేశారు. తన తండ్రి పొట్నూరి అప్పల నర్సింహమూర్తి పేరుతో రూ. 20 వేలు, యునైటెడ్ కాపు క్లబ్ తరపున రూ. 5 వేలు, పూలపల్లికి చెందిన ఉనికెల నాగేశ్వరరావు రూ. 5 వేలు మొత్తం రూ. 30 వేలు అందజేశారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకర్ మందులు అందించార న్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

పాలకొల్లు అర్బన్, జనవరి, 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీవర్స్ కాలనీలోని జీవీఎస్‌వీ ఆర్ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో పలు అభివృద్ధి పనులకు దాత తిల్లపూడికి చెందిన వ్యాపారి నడపన జగపతిరావు రూ. 25 వేలు విరాళాన్ని హెచ్‌ఎం ఆర్ భవానీ ప్రసాద్‌కు అందించారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించారు.

ఉచిత కంటి పరీక్షలు

మొగల్తూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పాలకొల్లుకు చెందిన రాధా రమణి లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటివైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని క్లబ్ జోనల్ ఛైర్మన్ డాక్టర్ ఎస్‌వీ రంగారావు ప్రారంభించారు. స్థానిక శ్రీనివాస ఆసుపత్రిలో నిర్వహించిన ఈ శిబిరంలో 103 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 42 మందికి కంటి ఆపరేషన్‌లు అవసరమైనట్టు గుర్తించారు. క్లబ్ అధ్యక్షులు ఉండవల్లి గీతా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేపై అవగాహన ర్యాలీ

పోడూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): భూ వివాదాల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహించే రీసర్వే పై రైతులు అవగాహన పెంచుకోవాలని పోడూరు తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ అన్నారు. మంగళవారం మట్టపర్రులో రీసర్వే పై రైతులకు అవగాహన కల్పించేందుకు రెవెన్యూ అధికారులు రైతులు, కూటమి నాయకులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రీసర్వేకు రైతులు సహకరించాలన్నారు. ముందుగా గ్రామ సచివాలయంలో రెవిన్యూ సదస్సు నిర్వహించి రైతులు నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచ్ దొమ్మేటి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ గుబ్బల సత్యనారాయణ, గ్రామటీడీపీ అధ్యక్షుడు కేతా హరికృష్ణ, ఆర్ఐ కందుల రాంబాబు, వీఆర్వో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీలో సూర్య హంసిని ప్రతిభ



భీమవరంటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌టిపిసి 41వ సబ్ జూనియర్ జాతీయ ఆర్చరీ ఛాంపియన్ షిప్ పోటీలు ఇటీవల జైపూర్‌లో నిర్వహించగా భీమవరంలోని భారతీయ విద్యాభవన్స్‌లో 11వ తరగతి చదువుతున్న మాదాల సూర్య హంసినీ వ్యక్తిగత కేటగిరిలో 720/695 స్కోర్‌తో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఈ ఈవెంట్‌లో రాష్ట్రం తరఫున మాదాల సూర్య హంసిని తదితరులు ఢిల్లీ జట్టుపై విజయం సాధించి కాంస్యం సాధించారు. మిక్సిడ్ టీమ్‌లో సూర్యహంసిని, విజయవాడకు చెందిన పల్లపు చరణ్ శ్రీకర్ మహారాష్ట్ర జట్టుపై విజయం సాధించి బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. హంసినిని స్టేట్ ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ చెరుకూరి సత్యనారాయణ, సెక్రటరీ జయరాజు అభినందించారు.

అలరించిన గాత్ర కచేరి

భీమవరంటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): భీమవరం త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 106వ త్యాగరాజ ఆరాధనోత్సవాలలో భాగంగా రెండో రోజు మంగళవారం సాయంత్రం చెన్నైకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసులు డీబీ అశ్విన్ గాత్ర కచేరి శ్రోతలను అలరించింది. మూడు గంటలపాటు సాగిన ఈ కచేరికి మద్రాసుకు చెందిన నందకుమార్, శ్రీరామ్‌లు వయొలిన్, మృదంగంతో సహకరించారు. శ్రీరాగంలో ఎందరో మహాను భావులను కీర్తనను ఆలపించినపుడు సంగీత ప్రియులు ఓలాలాడారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్ వెంకన్నబాబు జ్యోతి ప్రజ్వలన చేశారు. చెరుకువాడ వెంకట్రామయ్య, రంగసాయి, గన్నాబత్తుల శ్రీనివాస్, గంధం విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలు నేటి తరానికి తెలపాలి

భీమవరం టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నాటి సంస్కృతి సంప్రదాయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని భారతీయ విద్యా భవన్స్ అధ్యక్షుడు ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, కార్యదర్శి సామంతపూడి శ్రీరామరాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భారతీయ విద్యా భవన్స్ లో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భవన్స్ లో 300 మంది విద్యార్థులకు రంగవల్లులు, గాలిపటాలు, రోప్ స్కిప్పింగ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజే శామని అన్నారు. భవన్స్ డైరెక్టర్ ఎం. రఘుపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

చేపల చెర్వులకు లైసెన్సులు తప్పనిసరి

గణపవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుమతులులేని చేపల చెరువులకు ఈ నెల 31వ తేదీ లోగా లైసెన్సులు తెచ్చుకోవాలని గణపవరం గ్రామ మత్స్యశాఖ సహాయకురాలు షర్మిలాదేవి తెలిపారు. మత్స్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు లైసెన్సులు లభించకపోతే విద్యుత్ సబ్సిడీ రాయితీలు లభించవని తెలిపారు.



అవార్డు అందుకున్న ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రమణారావు

నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రమణారావు అరుదైన పురస్కారాన్ని సొంతం చేసుకున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఇండియన్ కాంక్రీట్ ఇనిస్టిట్యూట్ (ఐసీఐ) అవార్డుల ప్రదానోత్సవంలో హైదరాబాద్ సెంటర్ ఛైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా రమణారావు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. సివిల్ ఇంజరింగ్‌లో విశిష్ట సేవలందించినందుకు ఈ అవార్డు వరించింది. ఆయనను నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి, డీన్‌లు డాక్టర్ జీఆర్‌కే.శాస్త్రి, డాక్టర్ వి.సందీప్ డాక్టర్ ఎస్.జయరాం, డాక్టర్ హిమబిందు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి సంక్రాంతి సంబరాలు : మంత్రి నిమ్మల



పాలకొల్లు అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా దర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 13 వరకూ సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ ఛైర్మన్, జలవనరుల శాఖామంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. సంక్రాంతి సంబరాల కరపత్రాలను ఫౌండేషన్ సభ్యులు, టీడీపీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. మహిళలకు 8వ తేదీ ఉదయం పట్టణ స్థాయిలో శ్రీనివాస థియేటర్ రోడ్డులో ముగ్గుల పోటీలు, 9న ఉదయం యలమంచిలి జెడ్పీ హైస్కూల్లో గ్రౌండ్‌లో, 10వ తేదీ శుక్రవారం ఉదయం పాలకొల్లు మండల స్థాయిలో లంకలకోడేరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి వద్ద, 11న ఉదయం పోడూరు మండల స్థాయిలో జిన్నూరులో దేవళ్ళ దుర్గా ప్రసాద్ నివాసం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 12వతేదీ నియోజకవర్గస్థాయిలో పట్టణ, మండలాల స్థాయి విజేతలకు పట్టణంలోని బీఆర్ఎంవీఎం హైస్కూల్ ఆవరణలో ఉదయం ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు మొదటి బహుమతిగా టీవీ, 2వ బహుమతిగా ఫ్రిజ్, 3వ బహుమతిగా గ్రైండర్, మరో 5 ప్రత్యేక బహుమతులు, పోటీల్లో పాల్గొన్న అందరికీ ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు.

బత్తిలికి కొత్త బస్సు



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, జనవరి7 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. భీమవరం కొత్త బస్టాండ్ నుంచి బత్తిలికి సుమారు రూ. 60 లక్షలతో కొత్త బస్‌ను ఆర్టీసీ అధికారులు ఏర్పాటుచెయ్యగా ఎమ్మెల్యే మంగళవారం బస్‌కాంప్లెక్స్‌లో ప్రారంభించి మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని బస్సులను ప్రయాణీకుల కు అందుబాటులోకి తెస్తామని అన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ పిఎస్ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ఇటీవల ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 3 బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామన్నారు. టీడీపీ నాయకులు మెంటే పార్థసారథి, కోళ్ల నాగేశ్వరరావు, వబిలిశెట్టి రామకృష్ణ, మెరగాని నారాయణమ్మ, ఆర్టీసి అసిస్టెంట్ మేనేజర్ వై సురేష్, కారుమూరి సత్యనారాయణ మూర్తి, ముచ్చకర్ల శివ, చిక్కాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖకు సూపర్ లగ్జరీ



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసి బస్సు సర్వీసులు అన్ని రూట్లలో తిరిగేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం ఆర్టీసీ బస్టాండ్ వద్ద తాడేపల్లిగూడెం నుంచి విశాఖ వెళ్లే కొత్త సూపర్ లగ్జరీ బస్సును ఆయన ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పల నాయుడుతో కలిసి ప్రారంభించి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రోడ్లు విచ్ఛిన్నం చేసి సామాన్యులకు ఆర్టీసీని దూరం చేసిందని దీంతో చార్జీల భారంతో ప్రజలు ఇబ్బంది పడేవారన్నారు. రాష్ట్రంలో అన్ని రోడ్లు పునః నిర్మించి అన్ని రూట్లలో బస్సులు నడుపు తామన్నారు. డిపో మేనేజర్ వైఎస్ఎన్ మూర్తి, అసిస్టెంట్ మేనేజర్ సుధారాణి, కూటమి నాయకులు పాలూరి వెంకటేశ్వరరావు, అడబాల నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌కు రూ. లక్ష

తాడేపల్లిగూడెం అర్బన్: సమన్వయంతో కలసి పనిచేసి పట్టణాలను అభివృద్ధి చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో బలుసులమ్మ కళ్యాణ మండపంలో రీజనల్ డైరెక్టర్ సీహెచ్ నాగనరసింహారావు జిల్లా మున్సిపల్ కమిషనర్‌తో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌డీ నాగనరసింహారావు మాట్లాడుతూ పన్నుల వసూళ్ళపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, పారిశుధ్యంపై మున్సిపల్ కమిషనర్లతో పాటు అధికారులు మెరుగైన పనితీరు కనపర్చాల న్నారు. అనంతరం పట్టణ మున్సిపాలిటి నుంచి రెడ్‌క్రాస్ సొసైటీకి రూ. లక్ష చెక్కు అందజేసారు. మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ వ్యవస్థ కీలకం: భరత్



ఆకివీడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలందించడంలో హెచ్‌డీఎఫ్‌సీ ముందుంటుందని ఉప సభాపతి కనుమూరి రఘురామ కృష్ణరాజు తనయుడు భరత్ అన్నారు. మంగళవారం స్థానిక ఎస్ టర్నింగ్‌లోని నూత న భవనంలోకి మార్చిన బ్యాంకును ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో బ్యాంకింగ్ వ్యవస్థ కీలకమైందన్నారు. అనంతరం బ్యాంకు అధికారులు భరత్‌ను సన్మానించారు.

పూర్వ విద్యార్థులు కంప్యూటర్ వితరణ



కాళ్ళ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తాము చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయడానికి పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయమని కాళ్ళ ఎంఈవో ఏ.రవీంద్ర అన్నారు. కాళ్ళ జడ్పీ హైస్కూలుకు 1999-2000 పూర్వ విద్యార్థులు రూ. 58 వేల విలువైన కంప్యూటర్‌ను మంగళవారం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు శాస్త్రి, పూర్వ విద్యార్థులు చెన్నంశెట్టి దేవీ వరప్రసాద్, యిర్రింకి సురేష్, కొప్పర్తి అనూష, నిమ్మల రజని, కొప్పర్తి నారాయణ, యాళ్ళ శ్యాంబాబు, నిమ్మల ఆంజనేయులు, పీసీ ఛైర్మన్ బేతు నాగరాజు పాల్గొన్నారు.

జూద నివారణకు టీమ్‌లు

ఆచంట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో కోడిపందేలు, జూదం అరికట్టేందుకు మండల, గ్రామస్థాయి టీమ్‌లు ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ జి. కనకరాజు తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 8, 9, 10 తేదీల్లో జూదం నివారణపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పెనుగొండ: సంక్రాంతికి కోడిపందేలు, జూద క్రీడలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలపై ఉందని తహసీల్దార్ అనిత కుమారి పేర్కొన్నారు. ఎక్కడైనా జూదం నిర్వహిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

ఉచిత వైద్య సేవలు

తణుకు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రపతి రోడ్డులోని సంఘ కార్యాలయంలో వృద్ధులకు ఉచిత వైద్య పరీక్షలను ప్రముఖ వైద్యులు డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు నిర్వహించారు. 27 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి రిపోర్టును అందజేశారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాదరావు, గాంధీ, జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను పెంచాలి

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మంగళవారం మున్సిపల్ పరిపాలనా శాఖ ఆర్డీడీ సీహెచ్ నాగనరసింహారావుకు విజ్ఞప్తి చేశారు. తాడేపల్లిగూడెంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సమావేశానికి విచ్చేసిన ఆయనను ఆర్డీడీని ఏఐటీయూసీ అనుబంధ సంఘాలు మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది వినతిపత్రం సమర్పించారు.

రైతులకు సూచనలు

అత్తిలి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నిర్దేశిత లక్ష్యాలు పూర్తిచేసిన రైతులకు అన్ని పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు వ్యవసాయ సిబ్బందికి సూచించారు. మండలం లోని గ్రామ వ్యవసాయ సహాయ కులతో వ్యవసాయాధికారి కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. నాట్లపై రైతులకు అవగాహన కల్పించారు.

BEFORE THE COURT OF THE HON'BLE III ADDL.CHIEF METROPOLITAN MAGISTRATE : VIJAYAWADA
C.C. NO.503/2016

BETWEEN:
M/s. **SUMIL CHEMICAL INDUSTRIES PVT LTD.,** .... Complinant.
And
M/s. **Divya Pavani Traders,** .... Accused.

NOTICE OF PROCLAMATION U/s.82 of Cr.P.C

Under the orders of the Honorable III Addl. Chief Metropolitan Magistrate Court, Vijayawada., that a complaint was registered under above C.C.,U/s.138 of N.I. Act.,1881 this is bring to the Notice that Sri **Bokka Srinivasa Rao.,** Prop. M/s. **DIVYA PAVANI TRADERS,** D.No.6-53/1-A/B., Main Road, Jettipalem - 534280., Narsapuram Mandal West Godavari Dt., Andhra Pradesh, do hereby instruct that you are not attending the Honorable Court since long time in spite of Non-Bailable warrant issued against you. It has been shown to the satisfaction of this Honorable Court that you have been absconding or is concealing yourself to avoid the execution of the said Warrant. Hence, you are hereby instruct to attend the court on **10.02.2025** and submit your objections in person or through your advocate / counsel. Failing which you will be declared as a proclaimed offender by the court as provided for under the above section.

Station:Vijayawada
DATE :08/01/2025

By order in the name of the Honorable 3 ADDL.CHIEF METROPOLITAN MAGISTRTE COURT VIJAYAWDA.